క్లుప్తంగా

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీటీసీ కొండమ్మ, నేతలు

ముంచంగిపుట్టు: ప్రజా గాయకుడు గద్దర్ మృతికి మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ కేంద్రంలో ప్రజాప్రతినిధులు, స్థానికులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యురాలు చెండా కొండమ్మ మాట్లాడుతూ ప్రజాగాయకుడు గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. ఉద్యమ గళం మూగబోయిందన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజు, చిట్టిబాబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సింహాద్రి, పాల్గొన్న నేతలు

అరకులోయటౌన్: నియోజకవర్గ పరిధిలోని భగత కులస్తుల మేధోమధన సదస్సు ఆదివారం స్థానిక పున్నమి వేలి రిసార్ట్స్‌లోని గోష్టి సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ ప్రతినిధి కోడా సింహాద్రి, టీడబ్ల్యూయూ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు పి.కృష్ణారావు, నాయకులు శేషాద్రి, జేఏసీ సలహాదారు ఈశ్వరరావు తదితరులు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు భగత కులానికి ప్రాధాన్యత కల్పించి, ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. భగత కులస్తుల రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



దబ్బమామిడిలో సేంద్రియ ఎరువులను తయారీ చేస్తున్న సిబ్బంది

వై.రామవరం: మండలంలోని చామగడ్డ సచివాలయం పరిధిలోని దబ్బమామిడి గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆ శాఖ ఎం.ఎ.మాణిక్యాలరెడ్డి ఆధ్వర్యంలో మొదట ప్రకృతి వ్యవసాయం చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం వివిధ చీడపీడల నివారణకు సేంద్రియ ఎరువుల తయారీలో భాగంగా, గుడ్లు, నిమ్మకాయలు బెల్లం, నీటితో ద్రావణాన్ని తయారు చేయించారు. ద్రావణం వినియోగంపై సూచనలిచ్చారు. ఆవు మూత్రం, వేపాకులు, బొప్పాయి ఆకులు, జామ ఆకులు సీతాఫలం ఆకులు, గానుగ ఆకులు, నీటితో బ్రహ్మాస్త్రం అనే కషాయాన్ని తయారు చేయించారు. ఆయా ద్రావణాలను అన్ని రకాల పంటలపై పిచికారీ చేస్తే, చీడపీడలు పూర్తిగా నివారణమవుతాయని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ శాఖ ఐసీఆర్పీ పి.లచ్చిరెడ్డి, ఐబీఐసీ ఆర్పీ వెంకటలక్ష్మి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారపు పొద్దు, ఉద్యోగులు, విద్యార్థులకు సెలవు రోజు కావడంతో అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. పూలమాలలు, చీరలు, రవికెలు, అరటి గెలలు, తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కొందరు అమ్మ వారి జాతర జరిపి, అన్న సమారాధనలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఇదిలా ఉండగా అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా అష్ట లక్ష్మి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాటైన విగ్రహాలకు రంగులు వేసి, తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. వీటి ఏర్పాటుతో ఆలయం మరింత శోభయమానం కానుందని భక్తులు భావిస్తున్నారు.

అధిక వినియోగం.. అనర్థం

- పరిమితికి మించిన ఎరువుల వినియోగంతో పంటకు నష్టమంటున్న అధికారులు
- ఆర్‌బీకేల్లో రైతులకు అవగాహన

అరకు నియోజకవర్గంలో వరి సాగు

మండలం	సాగు విస్తీర్ణం(హెక్టార్లలో)
అరకులోయ	4,227
ముంచంగిపుట్టు	3,250
పెదబయలు	3,881
హుకుంపేట	5,120
డుంబ్రిగుడ	2,358
అనంతగిరి	2,170



వరి పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తున్న గిరిజన రైతులు

ముంచంగిపుట్టు: అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తే పంటలకు నష్టం తప్పదు. అధికంగా వాడడం వల్ల ప్రయోజనాల కంటే అనర్థాలే ఎక్కువని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి పి.మోహన్‌రావు పలు సూచనలు చేశారు. వరి సాగులో రసాయన ఎరువులు అత్యధిక వినియోగం అనర్థదాయకం, మోతాదుకు మించి వినియోగిస్తే పంటలకు నష్టంతో పాటు పర్యావరణానికి కూడా ఇబ్బందులు కలుగుతాయని చెబుతున్నారు. సంప్రదాయక విధానంలో రైతులు ఆయా గ్రామాల్లోని పురుగు మందుల దుకాణదారుల సలహాపైనే ఎక్కువగా ఆధారపడతారు. 90 శాతం మంది రైతులకు ఎరువులు, పురుగుల మందులపై అవగాహన లేక ఇష్టారీతిగా వినియోగిస్తున్నారు. దీని వల్ల వేల రూపాయల పెట్టుబడితో పాటు పంట, నేల, నిస్సారంగా మారడంతో పాటు పర్యావరణం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

ఆర్బీకేల ద్వారా సూచనలు, సలహాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల సందేహాలు పరిష్కారమవుతున్నాయి. నిత్యం ఆర్బీకేలలో వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు అందిస్తున్నారు. సాగు విధానాలు, ఎరువులు, పురుగుమందుల మోతాదుల విషయంలో రైతుల సందేహాలు తీర్చుతున్నారు. ఆర్బీకే సేవలను వినియోగించుకొని పంటల్లో మెలకువలు పాటిస్తూ రైతులు లాభసాటిగా సాగాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో మేలు



అధికంగా రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకం వల్ల పెట్టుబడులు పెరిగి రైతులు నష్టాలు కలుగుతాయి. రసాయనాల వినియోగం వల్ల భూసారం తగ్గిపోతుంది. సేంద్రియ ఎరువులు వినియోగం వల్ల నేల సారవంతమై పోషక శక్తి లభిస్తుంది. ఇంటి వద్ద చేసుకునే సేంద్రియ ఎరువుల వల్ల పంటలకు ఎన్నో లాభాలు కలుగుతాయి. రైతులంతా సేంద్రీయ ఎరువుల వ్యవసాయం అలవర్చుకోవాలి.

– ఎం.శ్రీనివాస్‌బాబు, ఏవో, ముంచంగిపుట్టు

అస్తవ్యస్తంగా సిగ్నల్స్‌తో తప్పని అవస్థలు



జీకే వీధిలో బీఎస్ఎన్ఎల్ టవర్

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని దేరాల గ్రామంలో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ టవర్ సేవలు అస్తవ్యస్తంగా మారాయి. రెండేళ్ల క్రితం గేరాల గ్రామ సమీపంలోని కళాశాల ప్రాంగణంలో ఈ టవర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పరిధిలో విద్యుత్ సరఫరా లేనిపక్షంలో తక్షణమే సిగ్నల్స్ నిలిచిపోతున్నాయని వినియోదారులు చెబుతున్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారాని చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పెదబయలు: మండలంలోని మారుమూల గోమంగిలో సెల్ టవర్‌లో గత వారం రోజుల నుంచి సిగ్నల్ లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఐదేళ్ల క్రితం బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుచేసినప్పటికీ వారానికి రెండు రోజులు కూడా సిగ్నల్ ఉండడం లేదంటున్నారు. స్థానికులతో పాటు గుల్లేలు, లింగేటి పోయివల్లి పంచాయతీలకు చెందిన వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ సేవలపై ఆధారపడుతున్నారన్నారు. వారానికి రెండు రోజులు సిగ్నల్స్ ఉన్నప్పటికీ సరిగా కాల్ కనెక్ట్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర వేళల్లో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోందంటున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పూర్తిస్థాయిలో సేవలు అందేలా చూడాలని కోరుతున్నారు. గోమంగిలో అస్తవ్యస్త బీఎస్ఎన్ఎల్ సేవలపై ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు సమావేశమయ్యారు. సిగ్నల్ సమస్యపై మాట్లాడారు. అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పాంగి జెట్టో, నాయకులు సత్తిబాబు.బొంజుబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

సీఎం పర్యటనకు తరలివెళ్లిన నేతలు

చింతపల్లి: అల్లూరి జిల్లా కూనవరంలో వరద బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం రానున్న నేపథ్యంలో చింతపల్లి నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం వాహనాల్లో వెళ్లారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో భాగంగా ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

బొజ్జయ్య సేవలు మరువలేనివి



బీజేపీ నేత బొజ్జయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

సాక్షి–పాడేరు: పాడేరు బీజేపీ సీనియర్ నేత, గిరిజన మోర్చా అధ్యక్షుడు కురుస బొజ్జయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పాడేరులో జరిగిన కార్యక్రమంలో బొజ్జయ్య విగ్రహాన్ని విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి పుట్ట గంగయ్య ఆవిష్కరించారు.పూలమాలలు వేసి నివాళులర్పించారు.గిరిజనుల సమస్యలపై అనేక ఉద్యమాలు చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం బొజ్జయ్య చేసిన సేవలను కొనియాడారు. మాజీ జీసీసీ డీఎం పార్వతమ్మ, ఎంఈవో నాగభూషణం, బీజేపీ రాష్ట్ర, జిల్లా నేతలు ఉమామహేశ్వరరావు, శాంతకుమారి, రాజారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం
- ఆందోళనలో గ్రామస్తులు



మాలగుమ్మి గ్రామంలో తుప్పు పట్టిన ఐరెన్ విద్యుత్ స్తంభం కింద భాగం

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ మాలగుమ్మి గ్రామంలో ఐరెన్ విద్యుత్ స్తంభం గిరిజనులను భయపెడుతుంది. ఐరెన్ విద్యుత్ స్తంభం కింద భాగం పూర్తిగా తుప్పు పట్టి పోవడంతో ఎప్పుడూ కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామస్తులు భయపడుతున్నారు. విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి ఎన్నో ఏళ్లు గడుస్తుందని, తక్షణమే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి, నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రయాణం..జర భద్రం


- ఘాట్‌రోడ్డులో కూలిన రక్షణ గోడలు
- కేబుల్ ఏర్పాటుకు తీసిన గోతులు.. పూడ్చని వైనం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



వైద సమీపంలో కేబుల్ వేసేందుకు తీసిన గోతులు



ఘాట్ రోడ్డులో వైద వద్ద కూలిన రక్షణగోడ



లబ్బూరు జంక్షన్ వద్ద కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

అనంతగిరి: మండలంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డు ప్రయాణాలు ప్రమాదభరితంగా మారాయి. రక్షణ గోడలను ఆనుకుని ఓహెచ్‌సీ కేబుల్ వేసేందుకు గోతులు తవ్వారు అయితే సక్రమంగా గోతులను పూడ్చిపెట్టకపోవడంతో ప్రమాదభరితంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోతుల గుండా వర్షపు నీరు ప్రవహించడంతో రక్షణగోడలు ఎక్కడికక్కడ నేలకూలాయి. దీనిపై కనీసం అధికారులు ఎస్‌హెచ్‌ఎస్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఘాట్‌రోడ్డు ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారింది. గత ఆరు నెలల క్రితమే ఘాట్‌రోడ్డులోని ఎస్‌హెచ్‌ఎస్ శాఖ ఘాట్‌రోడ్డు మరమ్మతులు చేపట్టారు. గతంలోని కూలిపోయిన రక్షణ గోడలు ప్రదేశంలోని ఐరన్ రక్షణ కంచెలను ఏర్పాటు చేశారు.

రక్షణ గోడలు నిర్మించాలి

ఓవైపుగా భారీ వర్షాలు కారణంగా మరో వైపుగా ఓహెచ్‌సీ కేబుల్ తవ్వకాలు చేపట్టి, గోతులను సక్రమంగా పూడ్చకపోవడంతో రోడ్డును ఆనుకుని రాళ్లు, మట్టి ప్రమాదభరితంగా మారాయి. దీంతో ఘాట్‌రోడ్డులోని ప్రయాణాలకు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఘాట్‌రోడ్డులోని పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గోతులను సక్రమంగా పూడ్చి, కూలిన రక్షణ గోడలు ప్రదేశంలోని కొత్తవి నిర్మించాలని, పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో కుమార్ మాట్లాడుతూ ఘాట్‌రోడ్డు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కోతకు గురైన రహదారి

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండల కేంద్రం నుంచి డుడుమ వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో లబ్బూరు జంక్షన్ సమీపంలో రహదారి కోతకు గురైంది. డుడుమ, మాకవరం, దొడిపుట్టు, వనుగుమ్మ, అసరాడ గ్రామాలకు చెందిన వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. కోతకు గురైన రహదారి వద్ద ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. రహదారిని బాగుచేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సర్పంచ్ సీలకంఠం, ఎంపీటీసీ కమలలు పలుమార్లు తెలియజేసినా కనీస స్పందన లేదని పలువురు చెబుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కోతకు గురైన రహదారిని బాగు చేయాలని ఆ మార్గం మీదుగా వెళ్లే వాహనదారులు, ప్రాంతీయులు కోరుతున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



మాట్లాడుతున్న ఎంఈవో త్రినాథరావు

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని శారదనికేతన్‌లో ఆదివారం విశాఖలోని కమల్ వెల్ఫేర్ ఫౌండేషన్, లోటస్ పాండ్ సంస్థల సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ఎంఈవో పంతాల త్రినాథరావు మాట్లాడుతూ శారదనికేతన్ సేవలు గిరిజన ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనులకు సేవలందించేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. డాక్టర్ అవినాష్ బృందం పాల్గొని వైద్య సేవలందించారు. లోటస్ పాండ్ సంస్థ ప్రతినిధి రామ్‌సాయి, శారదనికేతన్ పాఠశాల కమిటీ సభ్యుడు ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ చిరంజీవి, విద్యార్థులు, గిరిజనులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: తూర్పుగోదావరి జిల్లా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మారేడుమిల్లితో పాటు చుట్టపక్కల గ్రామాల నుంచి ఈ వైద్య శిబిరానికి రోగులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్లు జి.వి.రామారావు, సత్యదేవి, ప్రియాంక, సాహిత్యలు 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

అ‘పూర్వ’ కలయిక



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సందడి

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో సుమారు 60 సంవత్సరాల చరిత్ర గల అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి పాఠశాల పూర్వ విద్యార్థులు కార్యక్రమానికి హాజరయ్యారు. అలనాటి తీపి గుర్తులను నెమరవేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత తమకు పాఠాలు బోధించిన గురువులు టి.వి.శర్మ, బి.శ్రీనివాస్ కుమార్, విజయలక్ష్మి, ఎస్.అప్పారావు, కె.బాబూరావులను భారీ ఊరేగింపు నడుమ వేదిక వద్దకు తీసుకెళ్లి పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పలువురు గ్రామపెద్దలు కార్యక్రమానికి హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు శివకృష్ణ, శ్రీధర్, నానాజీ, కృష్ణ, నాగవర్మ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సాగని వరినాట్లు... మందకొడిగా పనులు



లబ్బర్తి గ్రామ శివారు సాగు భూమిలో వరి నాట్లు పడని దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలో కొన్నిచోట్ల వరినాట్లు ఇంకా పడలేదు. వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయి. మండలంలో వరి సాగువిస్తీర్ణం 5,600 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,500 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడినట్లు అధికారులు చెప్పుతున్నారు. సాధారణంగా జూలై చివరి నాటికే వరి నాట్లు పూర్తయ్యి ఏపుగా పెరుగాల్సిన పైరు నేటికి కొన్ని ప్రాంతాల్లో భూములు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఇందుకు ప్రధానకారణం వర్షాభావ పరిస్థితులే అని రైతులు చెబుతున్నారు. నెలలో ఏదో ఒక రోజు 44 ఎంఎం, 60 ఎంఎం వర్షం కురిసినా ఆ తరువాత వాన ముఖం చాటేస్తుండడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జూన్, జూలై నెలల్లో కురిసిన వర్షాలు ఆశాజనకంగా ఉన్నా వ్యవసాయ పనులకు అవసరమైనంతగా లేకపోవడంతో పలు వర్షాధారిత ప్రాంతాల్లో సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని రైతులు చెబుతున్నారు.

ఆయకట్టు భూముల్లో సైతం

రాజవొమ్మంగి, దూసరపాము, తంటికొండ పంచాయతీల్లో దాదాపు 3వేల ఎకరాల్లోని ఆయకట్టు భూములకు స్థానిక వట్టిగెడ్డ రిజర్వాయర్ ద్వారా సకాలంలో సాగు నీరు లభించక వరినాట్లు ఆలస్యంగా పడుతున్నాయి. ఈ రిజర్వాయర్‌కు గల పంట కాలువ ఎక్కడికక్కడ గండ్లు పడి, పూడికకు లోనయ్యి ఆయకట్టు శివారు భూములకు సాగునీరు చేరుకోలేని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. దీనితో ఈ ప్రాంతంలోని రైతులు వర్షాలపైనే ఆధారపడి వరిసాగు చేస్తున్నారు. ఇక ఒకటి రెండు రోజుల్లో వర్షాలు కురకవ పోతాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

టీడీపీ కుట్ర రాజకీయాలు దారుణం



జీకే వీధిలో మాట్లాడుతున్న నేతలు



జి.మాడుగులలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడెంకొత్తవీధి: పుంగనూరులో టీడీపీ నేతల దాడి వెనక పెద్ద కుట్ర దాగి ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం దాడిని ఖండించారు. శాంతిభద్రలను పరిరక్షించే పోలీసులపై దాడులు చేయడం దారుణమన్నారు. పార్టీ మండల అధ్యక్షుల బొబ్బిలి లక్ష్మణ్, ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్, ఎంపీటీసీ కొర్రా రాజులమ్మ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జడ్ ప్లస్ భద్రత కలిగిన చంద్రబాబు వెంటనే రూటు మార్చి రావడానికి అవకాశం లేదన్నారు. టీడీపీ నాయకులను ప్రణాళిక ప్రకారం రప్పించి పోలీసులపై దాడి చేయించారన్నారు. టీడీపీ కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో సరైన విధంగా బుద్ది చెబుతారనానరు. కో–ఆప్షన్ సభ్యుడు దావీదు, నాయకులు అరుణ్ రాజేశ్, శ్రీరాముడు, త్రినాథ్ పాల్గొన్నారు

జి.మాడుగుల: పుంగనూరులో టీడీపీ నాయకులు సృష్టించిన దాడులు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండంనాయుడు అన్నారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించి రాజకీయంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, నాయకులు లబ్ది పొందాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కుట్రలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీసులను బాధ్యులు చేయాలని పథకం ప్రకారం టీడీపీ కుట్ర రాజకీయాలు చేస్తోందన్నారు. రాజకీయ అవసరాల కోసం చంద్రబాబు ఎంత నీచానికైనా దిగజారుతారని అనేందుకు ఈ ఘటనే ప్రత్యక్ష సాక్ష్యమని వారు చెప్పారు. ఈ సంఘటనలో చంద్రబాబును ఏ1గా పేర్కొంటూ కేసు నమోదుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఎంపీటీసీ కూడా చిన్నారావు నాయకులు పాంగి చిట్టిబాబు, మసాడి గంగరాజు, సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మణ్, సచివాలయ కన్వీనర్లు సూర్యప్రకాష్‌నాయుడు, బాలయ్యపడాల్, బాలన్న, వార్డు సభ్యులు మంజెలి మణికుమారి పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి అమ్మవారికి ఒడ్డు పండగ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయరూ..



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ సీకరిపుట్టు, తొరంగులు, సంపంగిపుట్టు గ్రామాలకు అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు ఆదివాసీ సంఘం నాయకుడు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం సేవలు పొందేందుకు ఆయా గ్రామాలకు చెందిన పిల్లలను కిలోమీటర్ దూరంలో ఉన్న తమరడ గ్రామానికి పంపాల్సి వస్తోందని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పాడేరు ముంచంగిపుట్టు ప్రధాన రోడ్డు మీదుగు రోజు పిల్లలు వెళ్తున్నారని, సుమారు 4 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వస్తోందని, వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు పిల్లలు కలిపి 31 మంది ఉన్నారన్నారు. సీడీపీవోకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.